

పంటలపై ఏనుగుల దాడి

ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి: మండలంలోని కుప్పనపల్లి, కడపనతం, పాతపేట గ్రామాలలో ఆదివారం రాత్రి రెండు ఏనుగులు పంటలపై దాడి తిని, తొక్కి నాశనం చేశాయి. తిమ్మరాయప్పగారి భాస్కర్‌కు చెందిన 57 సెంట్ల టమోటా, శివలింగప్ప గౌండర్‌కు చెందిన 63 సెంట్ల రాగి పంటలను పూర్తిగా ధ్వంసం చేశాయని, నాగేంద్ర అనే రైతు పంటకు వేసిన కంచెను, వాటర్ పైపులను తొక్కినాశనం చేశాయని తెలిపారు. సోమవారం ఉదయం ఫారెస్టు బీట్ ఆఫీసర్ సుమ ఏనుగుల దాడిలో రైతులను జరిగిన పంట నష్టాన్ని పరిశీలించారు. పై అధికారులకు నివేదికను పంపనున్నట్లు తెలిపారు. డిపిఆర్ఓ వేణుగోపాల్ రెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



డబ్బులిస్తాం..

మీ ఓటు మాకే..

- ఉద్యోగులకు వైసిపి హుకుం
- నగదును గోశాలకు ఇచ్చిన ఉద్యోగులు

ప్రజాశక్తి- పుంగనూరు

పుంగనూరు నియోజకవర్గంలో ఉన్న ప్రభుత్వ ఉద్యోగులందరికీ ఒక్కో పోస్టల్ బ్యాలెట్‌కు రూ.3వేలు ఇచ్చి వైఎస్సార్‌సీపీకే ఓటు వేయాలని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అనుచరులు ఉద్యోగులకు హుకుం జారీ చేసినట్లు విశ్వసనీయ సమాచారం.. ఉద్యోగులు ఎవరైనా డబ్బులు తీసుకోకుండా నిరాకరికస్తే.. అంటే మీరు వైసిపికి ఓటు వేయరా అంటూ బెదిరింపు ధోరణితో ప్రశ్నించారట..! ఉద్యోగులు గత ఐదు సంవత్సరాలుగా ముఖ్యమంత్రిగా ఉన్న జగన్ మోహన్ రెడ్డి చేసింది ఏమీ లేదని, వస్తున్న జీతాల్లోనూ కోతలు విధించి ఉపాధ్యాయులను, ఉద్యోగులను ఇబ్బందులకు గురిచేశారని వారు బాహాటంగానే విమర్శిస్తున్నారు..

గత ఎన్నికల సమయంలో వైసిపి విడుదల చేసిన మేనిఫెస్టోలో సిపిఎస్ రద్దు చేస్తామన్నారు.. దీనిపై ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు ఎన్ని ఉద్యమాలు చేశారు. దీంతో వారు తమ సమస్యలు పరిష్కరించకపోగా ఉద్యమాన్ని రాష్ట్రప్రభుత్వం ఉక్కుపాదంతో అణచివేసిందని ఈ వ్యతిరేకత మొత్తం 2024 సార్వత్రిక ఎన్నికల్లో వ్యతిరేక ఓటు పడుతుందని వైసిపి నిర్ణయించుకుంది. అయితే పుంగనూరు నియోజకవర్గంలో మాత్రం అలా కాకూడదని వైసీపీ పెద్దలు ఉపాధ్యాయ, ఉద్యోగుల ఓట్ల కోసం విశ్వ ప్రయత్నాలు చేశారు. ఏదో ఒక రకంగా పోస్టల్ బ్యాలెట్ ఓట్లులో వైసీపీకే వేయించాలని డబ్బులు వెదజల్లారు.

నియోజకవర్గంలో ఓ పార్టీనేతతో 40 ప్రభుత్వ ఉద్యోగులు కూటమికి ఓటేస్తామని చెప్పారు. వారు కూడా ఉద్యోగస్తులకు మేము మీకు అండగా ఉంటాం అంటూ భరోసా ఇచ్చారు. అయితే ఉద్యోగులు కూటమి అభ్యర్థుల నుంచి ఎలాంటి సహాయం ఆశించకుండా ఓటు వేస్తామని కరాకండిగా చెప్పారు. పోస్టల్ బ్యాలెట్ ఎన్నిక రోజు వైసీపీ నాయకులు ఉపాధ్యాయులకు ఓటుకు రూ.3వేలు ఇస్తున్నాం తీసుకెళ్లండి అని చెప్పారు. అయితే ఓటుకు తమకు డబ్బులు అవసరం లేదని వారు చెప్పడంతో అయితే మీ పోస్టల్ బ్యాలెట్ ఓటు వైసీపీకి వేయరా..., మీరు వైసీపీకి ఓటు వేస్తుంటే మా వద్దకు వచ్చే డబ్బులు తీసుకెళ్లండి అని హుకుం జారీ చేశారు. ఉపాధ్యాయులు చేసేది లేక 40 పోస్టల్ బ్యాలెట్‌లకు సంబంధించి 1లక్ష 20వేలు వైసిపి దగ్గర నుంచి తీసుకొచ్చారు. కానీ వైసీపీ నుంచి తెచ్చుకున్న డబ్బులు వారు సొంతానికి వాడుకోవడానికి గోశాలకు అందజేశారు. ఈ విషయం ఎన్నికల తరువాత ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.

ఇసుక అక్రమ రవాణా అరికట్టాలి

ఇసుక రీచ్‌లను పరిశీలించిన జెసి శ్రీనివాసులు

ప్రజాశక్తి- చిత్తూరు డెస్క్:

ఓజి కుప్పం ఇసుక రీచ్ నుంచి ఇసుక అక్రమ రవాణా అరికట్టాలని జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు అన్నారు. సోమవారం నగరి మండలం, ఓజి కుప్పం ఇసుక రీచ్‌ను పరిశీలించిన ఆయన రీచ్‌లో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. భూగర్భ గనులు శాఖ జిల్లా అధికారులు, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, షబ్, ఎక్సైజ్, గ్రౌండ్ వాటర్, ఇరిగేషన్, రవాణా శాఖల అధికారులతో కలసి నగరి మండలం పరిధిలోని ఓజి కుప్పం పరిధిలో ఉన్న ఇసుక రీచ్‌ని పరిశీలించారు. జెసి మాట్లాడుతూ సుప్రీం కోర్టు ఉత్తర్వులు మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన సూచనల ప్రకారంగా ఇసుక రీచ్‌ని పరిశీలించడం జరిగిందన్నారు. ఈ రీచ్‌కు సంబంధించి అనుమతి గడువు పూర్తి అయినా ఇంకా ఇసుక అక్రమ రవాణా జరుగుతుంటే విఆర్ఓ, పంచాయతీ సెక్రటరీ, సంబందితశాఖ అధికారులు ఏమి చేస్తున్నారని, ఇసుక అక్రమ రవాణాను అరికట్టవలసిన బాధ్యత మీకు లేదా అని ప్రశ్నించారు. వెంటనే రీచ్‌లో ఇసుక అక్రమ తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయాలని, చుట్టూ పక్కల గ్రామాలలో ఎవ్వరైనా ఇసుక అక్రమరవాణా చేస్తే కఠినమైన చర్యలు తీసుకుంటామని టామ్.. టామ్.. వేయించాలని పంచాయతీ సెక్రటరీని, మండల తహాశీల్దార్‌ను ఆదేశించారు. జిల్లాలో ప్రభుత్వంచే గుర్తించిన 14 ఇసుక రీచ్‌లను సంబంధిత శాఖల అధికారులతో కలసి పరిశీలించడం జరిగిందన్నారు. జిల్లాలో ఇసుక రీచ్‌ల కమిటీకి చైర్మన్‌గా జిల్లా కలెక్టర్, వైస్ చైర్మన్ జాయింట్ కలెక్టర్, భూగర్భ గనులశాఖ, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్, డిపిఓ, ఆర్‌టిఓ, గ్రౌండ్ వాటర్, సెబ్ మెంబర్లగా ఉంటారన్నారు. గతంలో జిల్లా వ్యాప్తంగా 14 ఇసుక రీచ్లకు అనుమతులు ఇవ్వడం జరిగిందన్నారు. ఆ ఇసుక రీచ్‌ల గడువు పూర్తి అయిందన్నారు. నగరి మండలంలో వాగులు, వంకలు ఎక్కడ కూడా ఇసుక అక్రమరవాణా జరగకూడదన్నారు. ఎక్కడైనా ఇసుక అక్రమరవాణా జరుగుతుంటే ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. జాయింట్ కలెక్టర్ వెంట ఏఎస్పీ, సెబ్ ఇన్‌చార్జి సుబ్బరాజు, భూగర్భ గనుల శాఖ డిడికేవెల్ ఎం.ప్రసాద్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఏఈఈ మదన్ మోహన్, డిపిఓ లక్ష్మి, నగరి మండల తహాశీల్దార్ చంద్రశేఖర్ రెడ్డి, పంచాయతీ సెక్రటరీ, విఆర్ఓ, భూగర్భ గనుల శాఖ అధికారులు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

గంగాధర నెల్లూరు: జిల్లాలో ఇకమీదట ఎక్కడైనా నదులు వాగులు, వంకల్లో నుంచి ఇసుక అక్రమ తరలిస్తుంటే సామాన్య పౌరుల నుంచి ప్రజాప్రతినిధులు అడ్డుకోవచ్చని జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు పేర్కొన్నారు. మండలం లోని ముక్కళత్తూరు, కొట్రకోన, నందనూరులో ఇసుక రీచ్‌లను సోమవారం జాయింట్ కలెక్టర్ తనిఖీలు చేశారు. జిల్లాలోని ఇసుక రీచ్‌ల పరిమిత కాలం ముగిసిందని, ఇసుక రీచ్‌లకు గాను ఎక్కడా అనుమతులు లేదన్నారు. వివిధ గ్రామాల్లో ఇసుక రీచ్‌ల తనిఖీలు గురించి వివరాలు ఉన్నతాధికారులకు అందజేస్తామన్నారు.



ఓజి కుప్పం ఇసుక రీచ్‌ను పరిశీలిస్తున్న జెసి శ్రీనివాసులు

24 నుంచి టెన్త్ సప్లమెంటరీ



ప్రజాశక్తి -తిరుపతి టౌన్: జిల్లాలో మే 24 నుంచి జూన్ 3 వరకూ జరగనున్న పదవ తరగతి సప్లమెంటరీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని డిఆర్ఓ పెంచల్ కిషోర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. పరీక్షలు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 వరకు జరుగుతాయన్నారు. విద్యార్థులను 8.45కు కేంద్రాల్లోకి అనుమతిస్తామన్నారు. ఆలస్యంగా వచ్చిన వారిని పరీక్ష కేంద్రంలోకి అనుమతించేది లేదని స్పష్టం చేశారు. సోమవారం మధ్యాహ్నం జిల్లా కలెక్టరేట్‌లోని డిఆర్ఓ ఛాంబర్ నందు సంబంధిత శాఖల సిబ్బందితో పదవ తరగతి సప్లమెంటరీ పరీక్షల నిర్వహణపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఆర్ఒ మాట్లాడుతూ.. పదవ తరగతి సప్లమెంటరీ పరీక్షలను పగడ్బందీగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లాలో 5530 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకానున్నారని, వారి కోసం 23 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ప్రతి పరీక్షా కేంద్రం వద్ద తాగునీటి వసతి, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, బీపీ, షుగర్ చెక్ చేసే పరికరాలు, అత్యవసర మందులతో వైద్యారోగ్యశాఖ సిబ్బంది ఒకరు అందుబాటులో ఉండాలన్నారు. మాస్ కాపీయింగ్ నిరోధించేందుకు రెండు ఫ్లయింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేసి తనిఖీ చేయాలన్నారు. అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ గవర్నమెంట్ ఎగ్జామ్ గురు స్వామి రెడ్డి, ఆర్ఐఓ ప్రభాకర్ రెడ్డి పాల్గొన్నారు.

'సచివాలయ సిబ్బంది

విధులకు హాజరవ్వాలి'

ప్రజాశక్తి- పుంగనూరు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడిఓ మునిరెడ్డి

ఎన్నికలు పూర్తి అయిన తర్వాత నుంచి మండలంలో ఎక్కడా సచివాలయ సిబ్బంది విధులకు సక్రమంగా హాజరు కావడం లేదని, ఇలాంటి సంఘటనలు తమ దృష్టికి వస్తే, ఎవరైనా ఫిర్యాదులు చేసిన సచివాలయం సిబ్బందిపై తప్పనిసరిగా చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో మునిరెడ్డి చెప్పారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సాధారణ సర్వసభ్య సమావేశం ఎంపీపీ అక్కిసాని భాస్కర్ రెడ్డి అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. ఎన్నికల షెడ్యూల్ నియమ నిబంధనలు మేరకు సమావేశంలో అత్యవసర జెండాపై మాత్రమే చర్చ జరిపి సమావేశాన్ని ముగించారు. ఈ సందర్భంగా కొందరు సర్పంచులు మాట్లాడుతూ జలజీవన్ మిషన్ ద్వారా తాగునీటికి పైప్లైన్ ఏర్పాటు చేసామని ఏడాది పూర్తయిన బిల్లులు ఇప్పటివరకు కాలేదని సమావేశ దృష్టికి తీసుకెళ్లారు. ఎంపీటీసీ నాగభూషణ్ రెడ్డి మాట్లాడుతూ పంచాయతీ పరిధిలో ఉన్న ఆరో ప్లాంట్ నిర్వహణ ఎవరు నిర్వహించాలని సమావేశంలో ఎంపీపీ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై ఎంపీపీ అక్కిసాని భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ ఆరో ప్లాంట్ నిర్వహణ పంచాయతీ జనరల్ ఫండ్ నుంచి కానీ, లేక 15వ ఆర్థిక సంఘనిధుల నుంచి కానీ ఖర్చు చేసి నిర్వహణ చేసుకోవాలన్నారు. దీనిపై పంచాయతీలో ఉన్న ప్రజల వద్ద నుంచి ఎలాంటి డబ్బులు వసూలు చేయకూడదన్నారు. వ్యవసాయశాఖ అధికారి మాట్లాడుతూ మండలంలోని 20 రైతు భరోసా కేంద్రంలో 1950 క్వింటాళ్లు వేరుశనగ విత్తనాలు నిల్వ చేసినట్టు చెప్పారు. ఈనెల 23 తర్వాత విత్తనాలు పంపిణీ కార్యక్రమాన్ని చేపడతామన్నారు. గత ఏడాది వచ్చిన దానికన్నా ఈ ఏడాది వేరుశనగ విత్తనాలు తక్కువ వచ్చాయని, గత ఏడాది సాగు విస్తీర్ణం బట్టి ఈ ఏడాది కూడా వేరుశనగ విత్తనాలు రావడం జరిగిందన్నారు. గత ఏడాది వచ్చిన వేరుశనగ విత్తనాలు ఈ ఏడది కూడా అంతే వేరుశెనగ విత్తనాలు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని ఎంపీపీ వ్యవసాయశాఖ అధికారికి సూచిచారు. మండలంలోని బోడేవారిపల్లి, నేతిగుట్లపల్లి, చంద్రమాకులపల్లి పంచాయతీలలో విద్యుత్ లైన్మెన్లు లేక సమస్యలు ఎదుర్కొంటున్నామని సర్పంచులు, ఎంపీటీసీలు తెలిపారు. తాగునీరు, కరెంటు వంటి సమస్యలు ఉన్నట్లయితే కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారాన్ని కృషి చేస్తామని ఎంపీడీవో తెలిపారు. ముడా చైర్మన్ ఎన్.వెంకట్ రెడ్డి యాదవ్, బోయకొండ ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ నాగరాజురెడ్డి, వైస్ ఎంపీపీలు ఈశ్వరమ్మ పాల్గొన్నారు.

నేడు తిరుపతి గంగమ్మ జాతర



ప్రజాశక్తి -తిరుపతి టౌన్: తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ జాతర మంగళవారం అత్యంత వైభవంగా జరగనుంది. ఎన్నికల కోడ్ నేపథ్యంలో పాలకమండలి జోక్యం లేకుండానే జాతరను ఆలయ అధికారులు నిర్వహిస్తున్నారు. సోమవారం ఉదయం తిరుపతి అర్బన్ నూతన ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఆలయంలో అమ్మవారిని దర్శించుకొని పరిసర ప్రాంతాలను పరిశీలించారు. మంగళవారం జరిగే జాతరకు ఉమ్మడి చిత్తూరు జిల్లానుంచే కాకుండా, పక్క జిల్లాల నుంచీ, తమిళనాడు నుంచి బంధువులు పెద్ద సంఖ్యలో తరలి వస్తారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలని గంగమ్మ ఆలయ ఈవో మమతను ఎస్పి ఆదేశించారు. పోలీసులు, కార్పొరేషన్, విద్యుత్, దేవాదాయ, తుడ అధికారులు సహాయ సహకారాలు అందిస్తున్నారు. జాతరకు భక్తులు వేలాదిగా పొంగళ్లు పెట్టనున్న నేపథ్యంలో తిరుపతి ఇందిరా ప్రియదర్శిని కూరగాయల మార్కెట్‌కు సెలవు ప్రకటించారు. గతేడాది గంగమ్మ జాతరను సీఎం జగన్ మోహన్ రెడ్డి రాష్ట్ర పండుగగా ప్రకటన చేశారు. దాదాపు 900 ఏళ్ల చరిత్ర కలిగిన ఆలయం కావడం.. మరెక్కడా జరగని విధంగా వారం రోజుల పాటు జాతర జరిగే ఏకైక ఆలయం కావడంతో గంగమ్మ తల్లి జాతరను.... రాష్ట్ర పండుగగా ప్రకటించడం విశేషం

జాతర చరిత్ర

పురాణ వైశిష్ట్యం కలిగిన ఆలయాలకు నెలవు చిత్తూరు జిల్లా. గ్రామ దేవతలను ఆరాధించే ఆచారం కలిగిన ప్రాంతం కూడా ద్రావిడమే. దేశంలో ఎక్కడ లేని విధంగా తిట్ల దండకంతో పచ్చి బూతులు తిడుతూ వైభవంగా జరుపుకొనే పండగే తిరుపతి తాతయ్య గుంట గంగమ్మ జాతర. రాష్ట్రంలో ఎన్నో గంగమ్మ జాతరలు చూసి ఉంటాం.... కానీ తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ జాతర ఎంతో ఫేమస్. దక్షిణాది నుంచి భారీ స్థాయిలో పాల్గొనే పండుగ ఈ గంగమ్మ జాతర. దాదాపు వెయ్యి ఏళ్ల పూర్వం నాటి నుంచి ఆనవాయితీగా వస్తున్న ఆచారం. ఈ జాతర ఒక్కరోజులో ముగిసేది కాదు. వారం రోజుల పాటు సాగే ఈ జాతరను తిరుపతి వాసులు ఎంతో ప్రత్యేకంగా జరుపుకుంటారు. ఒక్కో రోజు ఒక్కో వేషధారణలో భక్తులు ఆలయానికి రావడం విశేషం.

ఆచార వ్యవహారాలకు, సంప్రదాయాల సమ్మేళనమే నేటి భారతం. భారత దేశాన్ని ఎందరో రాజులు పరిపాలన సాగించారు. బ్రిటిష్ పాలనకు పూర్వం రాజుల వద్ద సామంతులు, పాలెగాళ్ళు ఆధిపత్యంగా వ్యవహరించేవారు. అప్పటి పరిస్థితుల్లో తిరుపతిని పాలెగాళ్ళు పరిపాలన సాగించారు. రాజ్యాధికారంతో ప్రజలను చిత్రహింసలకు గురిచేసేవారు. కామంతో కళ్లు మూసుకుపోయిన పాలెగాళ్లు అందమైన అమ్మాయి కనిపిస్తే చాలు తన వశం చేసుకునేవాడు. ఒప్పుకోకుండా చెరపట్టేవారు. ఎవరైనా పెళ్లి చేసుకున్నారంటే ఆ నవ వధువును ముందుగా పాలెగాడి దగ్గరకి పంపాల్సిందే. వాడు అనుభవించాకే పెళ్లి చేసుకున్న వరుడు అనుభవించాలనే ఆంక్షలు విధించాడు. అరాచక శక్తి రాజ్యం ఏలుతున్న సమయంలోనే స్త్రీ జాతిని రక్షించేందుకు జగత్ జనని తిరుపతి సమీప ప్రాంతంలోని అవిలాల గ్రామంలో గంగమ్మ తల్లి జన్మించింది. కైకాల కులస్థుల కుటుంబంలో గంగమ్మగా ఆవిర్భవించింది యుక్త వయసుకి వచ్చిన గంగమ్మపై యథావిధిగా పాలెగాడి కన్నుపడి ఆమెను బలాత్కరించబోయాడట. దీంతో గంగమ్మ తన విశ్వరూపాన్ని ప్రదర్శించిందట. తనను అంతమొందించేందుకు అవతరించిన పరాశక్తే గంగమ్మ అని తెలుసుకున్న పాలెగాడు పరుగులుపెట్టాడు.. దాక్కున్నాడు.. అలా దాక్కున్న పాలెగాడిని బయటకు రప్పించేందుకు గంగమ్మ తల్లి వేర్వేరు చిత్ర విచిత్ర వేషాలను ధరించిందట. అలా గంగమ్మ అనేక వేషాలు ధరించి మూడు రోజులపాటు పాలెగాడి కోసం గాలించింది. అయినా పాలెగాడు దొరకకపోవడంతో నాలుగోరోజు గంగమ్మ దొరవేషం వేయడంతో తన ప్రభువైన దొర వచ్చాడనుకుని పాలెగాడు బయటకు వచ్చాడు. ఈ దుష్టశిక్షణను తలచుకుంటూ ఆ తల్లి తమను చల్లగా కాపాడాలని కోరుకుంటూ ఏటా ప్రజలు ఈ జాతరను వైభవంగా జరుపుకోవడం నేటికీ సాగుతోంది.

కొండెక్కిన కోడి

తిరుపతి తాతయ్య గుంట గంగమ్మ జాతర సందర్భంగా కోళ్ల ధరలు కొండెక్కి కూర్చున్నాయి. మొన్నటి వరకు కిలో చికెన్ 220 నుంచి 250 రూపాయలు ఉండగా, ఇప్పుడు కిలో చికెన్ 300 రూపాయలు ధర పలుకుతుంది, వేసవికాలంలో కోళ్లు పెంపకం తగ్గిపోవడంతో ధర పెరిగిందని వ్యాపారులు చెబుతున్నారు. అదే నాటుకోడి అయితే 450-500గా ఉంది. కోడిపుంజు కిలో రూ.500పైమాటే. పొటేళ్లు 10 కిలోలు 9వేల నుంచవ 12వేల వరకూ ఉంది. మేకపోతు 10 కిలోలు 15వేలుగా ఉంది. గంగమ్మ జాతర సందర్భంగా ప్రతి ఇంటి నుంచి కోడి కోయడం ఆనవాయితీ. గంగమ్మ జాతర సందర్భంగా తిరుపతి నగరంలో వివిధ గ్రామాల నుంచి నాటు కోళ్లు, కోడిపుంజు, పిట్ట, మేకలు తీసుకొచ్చి భారీగా అమ్మకాలు సాగిస్తున్నారు. జాతర సందర్భంగా ఆలయం వద్ద బలి ఇవ్వడం విశేషం. ఆలయం వద్ద బలి ఇచ్చేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. బలి ఇవ్వడం తప్పని అధికారులు చెబుతున్నా, వారే స్వయంగానూ ఇస్తుండటం గంగమ్మ జాతర విశేషం.

సారె సమర్పించిన మేయర్ శిరీష, చెవిరెడ్డి

తిరుపతి తాతయ్య గుంట గంగమ్మ జాతరలో భాగంగా సోమవారం ఉదయం మేయర్ డాక్టర్ శిరీష, వైష్ణవి ఆస్పత్రి అధినేత డాక్టర్ మునిశేఖర్ దంపతులు గంగమ్మ ఆలయానికి ఊరేగింపుగా వచ్చి సారె సమర్పించారు. తిరుమల తిరుపతి దేవస్థానం అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి, తిరుపతి వైసిపి అసెంబ్లీ అభ్యర్థి భూమన అభినయ్, దొడ్డారెడ్డి సిద్దారెడ్డి, ప్రవల్లిక, తులసియాదవ్, దేవదానం తదితరులు పాల్గొన్నారు. చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలోనూ సారె సమర్పించారు.

విద్యుత్తు అధికారుల విస్తృత దాడులు

ప్రజాశక్తి- కార్వేటినగరం



అక్రమ విద్యుత్ వాడకాన్ని తొలగిస్తున్న విద్యుత్ విజిలెన్స్ ఈఈ బాలాజీ

విద్యుత్ చోరీపై అధికారులు విస్తృత్త దాడులు నిర్వహించి కేసులు నమోదు చేసినట్లు విజిలన్స్ విభాగం ఈఈ బాలాజీ తెలిపారు. సోమవారం మండల కేంద్రంలో విస్తృత్తంగా తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా విద్యుత్ ఏడీగా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈఈ బాలాజీ మాట్లాడుతూ కార్వేటినగరం పరిధిలో ఎక్కువగా అక్రమ విద్యుత్ వాడకం చేపడుతూ విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్నట్లు అందిన సమారం మేరకు దాడులు నిర్వహించడం జరిగిందన్నారు. కార్వేటినగరం పెద్దదళితవాడ వద్ద ఏర్పాటు చేసిన వాలీబాల్ క్రీడా మైదానానికి ఏర్పాటు చేసిన అక్రమ విద్యుత్ కనెక్షన్ను తొలగించి వాటికి వినియోగించిన విద్యుత్ వైయర్లను స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. అలాగే నగరంలో దుకాణలపై విస్తృత్తంగా దాడులు నిర్వహించి సుమారు 35 అడిషనల్ లోడ్డు కేసులు నమోదు చేయడమే కాకుండా 3మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు చేసి రూ.లక్ష వరకు జరిమాన విధించడం జరిగిందన్నారు. కార్వేటినగరం డివిజన్ పరిధిలో ఎక్కడైనా విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్నట్లు తెలిసిన వెంటనే 94408 11820 ఏడీఈ నాగరాజుకు, 94408 11821 ఏఈ రియాజ్ అహ్మద్ నంబర్లకు సమాచారం అందించి విద్యుత్ చౌర్యాన్ని అరికట్టేందుకు ప్రజలు సహకరించాలని పిలుపునిచ్చారు. వారి వెంట విజిలన్స్ విభాగం ఏఈలు హరి, కృష్ణయ్య. రాజ పలువురు విద్యుత్ సిబ్బంది ఉన్నారు.

23 నుంచి వేరుశనగ విత్తనాలు పంపిణీ



ప్రజాశక్తి- వి కోట: మండల పరిధిలో ఖరీఫ్ సీజన్‌లో వేరుశనగ సాగుచేయు రైతులకు 40 శాతం రాయితీతో విత్తనాలు పంపిణీ చేయడం జరుగుతుందని ఏవో రాజేష్ తెలిపారు. ఈనెల 23వ తేదీ నుండి రైతు భరోసా కేంద్రాల్లో విత్తనం పంపిణీ కొరకు రిజిస్ట్రేషన్ ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. మండలంలోని 18 పంచాయతీల పరిధిలో ఉన్న రైతులకు విత్తనాలు సిద్ధంగా ఉన్నాయన్నారు. ఆర్‌బికె పరిధిలో ఉన్న రైతులు వేరుశనగ విత్తనాలు కావాల్సిన రైతులు సోమవారం నుండి నమోదు చేసుకోవాలని సూచించారు. 30 కేజీల బస్తా విలువ మార్కెట్లో రూ.2850లు కాగా ప్రభుత్వ సబ్సిడీ 40% రూ.1140లు పోను రైతు చెల్లించవలసింది రూ.1710లు అని మండల వ్యవసాయ అధికారి రాజ్యలక్ష్మి తెలిపారు. మండలంలోని కృష్ణాపురం, ఓగు, వీకోట, జవనపల్లి రైతు భరోసా కేంద్రాల్లో 27వ తేదీ పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు.

రిజిస్ట్రేషన్ తప్పనిసరి : మండల వ్యవసాయ అధికారిని సరిత

గంగవరం: ప్రభుత్వం రైతులకు పంపిణీ చేస్తున్న వేరుశనగ విత్తనాల కోసం రిజిస్ట్రేషన్ తప్పనిసరి అని మండల వ్యవసాయ అధికారిని సరిత అన్నారు. గంగవరం మండలం ఖరీఫ్ 2024లో 1440 క్వింటాళ్ళ వేరుశెనగ విత్తన కాయలు, ప్రభుత్వ సబ్సిడీ 40%తో రైతులకు పంపిణీ చేయడం కోసం సిద్ధంగా ఉన్నాయన్నారు. విత్తన కాయల కొరకు రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి భూమి కలిగిన రైతులు తమ ఆధార్, 1బి జిరాక్స్, మొబైల్ ఫోన్ తీసుకొని రావాలని తెలిపారు.

వెదురుకుప్పం: ప్రభుత్వం అందించే రాయితీ వేరుశనగ విత్తనాలను ఈ నెల 23వ తేదీ నుంచి పంపిణీ చేయనున్నట్లు వ్యవసాయ అధికారి వనిత తెలిపారు. మండలంలో ఆయా పంచాయతీలో ఉన్న ఆర్‌బికె కేంద్రాల నుంచి విత్తనాలను రైతులకు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. విత్తనాలు కావలసిన రైతులు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ కార్డు, మొబైలు ఫోన్ తమ వెంట తీసుకెళ్లి టోకెన్లు తీసుకోవాలని తెలిపారు.

ఎస్ఆర్ పురం: రైతు భరోసా కేంద్రాలలో వేరుశనగ విత్తనాల కోసం రిజిస్ట్రేషన్లు ప్రారంభం అవుతుందని మండల వ్యవసాయ అధికారి నర్మద తెలిపారు. సబ్సిడీ వేరుశనగ విత్తన కాయలు కోసం మీమీ పరిధిలోని ఆర్బికే కేంద్రాలలో రైతులు ఈనెల 23వ తేదీ నుండి రిజిస్ట్రేషన్లు చేసుకోవాలన్నారు.

సోమల: రాయితీ వేరుశనగ విత్తనాల కోసం మండలంలోని 13 రైతు భరోసా కేంద్రాల పరిధిలో మొదటి రోజు సోమవారం 250 మంది రైతులు రిజిస్ట్రేషన్ చేయించుకొని సీలు వేసిన టోకెన్లు పొందినట్టు వ్యవసాయశాఖ అధికారి సుధాకర్ తెలిపారు. అనంతరం రిజిస్ట్రేషన్ ప్రక్రియను పుంగనూరు వ్యవసాయ సహాయ సంచాలకులు శివకుమార్ రాజు, మండల కేంద్రంలోని రైతు భరోసా కేంద్రంలో పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలను అందజేశారు.

గంగాధర నెల్లూరు: వేరుశనగ విత్తన బస్తాలను ఈనెల 23 తేదీ నుండి పంపిణీ చేయడం జరుగుతుందని వ్యవసాయశాఖ ఏడీ సౌభాగ్యలక్ష్మి తెలిపారు. గంగాధర నెల్లూరు ఎంపీడీవో కార్యాలయంలో గంగాధర నెల్లూరు, శ్రీరంగరాజపురం, పాలసముద్రం మండలాల వ్యవసాయ శాఖ సిబ్బందితో వేరుశనగ విత్తన పంపిణీపై ఏడీ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ ఏడీ మాట్లాడుతూ ఈనెల 23వ తేదీ నుండి ప్రభుత్వం నిర్దేశించిన ధర 40 శాతం సబ్సిడీ పోగా ఒక వేరుశనగ బస్తా రూ.1,710 రూపాయలతో రైతులకు అందజేస్తామని, వేరుశనగ విత్తనాలు కావలసిన రైతులు ముందుగా తమ పాసుబుక్, ఆధార్ కార్డు మొబైల్ ఫోన్ తో రైతు భరోసా కేంద్రం వద్ద రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు.

జైపూర్‌కు శ్రీసిటీ కొబెల్కో క్రేన్ల రవాణా



ప్రజాశక్తి - తడ: శ్రీసిటీ లోని కొబెల్కో ఇండియా సంస్థ, సోమవారం తమ పరిశ్రమ ఉత్పత్తులైన భారీ ఎక్స్‌కవేటర్‌లను (మట్టి తవ్వే యంత్రం) తడ రైల్వే స్టేషన్ నుండి రైలులో రాజస్థాన్‌లోని జైపూర్‌కు రవాణా చేసింది. ఇది తడ రైల్వే స్టేషన్ నుండి "మేడ్ ఏ శ్రీ సిటీ" పారిశ్రామిక ఉత్పత్తుల మొట్టమొదటి ప్రత్యక్ష రైలు రవాణా కావడం విశేషం. తమ మొదటి రవాణాలో 35 ఎక్స్‌కవేటర్‌లను కొబెల్కో సంస్థ తరలించింది. ఉత్తరభారతదేశానికి రైలు రవాణా దిశగా పెరుగుతున్న డిమాండు దష్ట్యా తమ భారీ వాహనాల రవాణాకు ఈ సదుపాయాన్ని ఎంచుకున్నట్లు కొబెల్కో ప్రతినిధి పేర్కొన్నారు. దీంతో పాటు, ఈ రైలు రవాణా ద్వారా 20 శాతం వరకు ఖర్చు ఆదా అవుతుందన్నారు. ఇంకా, ట్రక్కుల ద్వారా చేసే రోడ్డు రవాణాతో పోలిస్తే ఈ పద్ధతి కర్బన ఉద్గారాలను తగ్గించడంలో సహాయపడుతుందని చెప్పారు. తడ రైలు రవాణా సేవలపై శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి తన ప్రకటనలో సంతోషం వ్యక్తం చేశారు. ఈ రవాణా కోసం తడ స్టేషన్‌లో మెరుగైన కార్గో హ్యాండ్లింగ్ సౌకర్యాలు, కంటైనర్ జోన్, మెరుగైన మౌళిక సదుపాయాలను రైల్వే శాఖ కల్పించాలని ఆయన చెప్పారు. ఇది వ్యాపార అవసరాలకు ఎంతో సౌకర్యవంతంగా ఉండడమే కాకుండా, రైల్వే శాఖకు గణనీయమైన ఆదాయాన్ని సమకూర్చు తుందని అన్నారు. తక్కువ ఖర్చుతో తమ ఉత్పత్తులను రవాణా చేయడానికి శ్రీసిటీ పరిసర ప్రాంతాల పరిశ్రమలకు ఇది అత్యంత ప్రయోజనకరమైన సదుపాయంగా ఆయన వ్యాఖ్యానించారు.

గుడి స్థలం ఆక్రమణ

చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు ఫిర్యాదు

ప్రజాశక్తి- తవణంపల్లి: మండలంలోని మడవనిరి గ్రామంలో గంగమ్మ గుడికి కేటాయించిన స్థలాన్ని ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు సోమవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. మడవనిరి దళివాడకు చెందిన నాయకులు మునస్వామి, రాజకుమార్ మాట్లాడుతూ తమ పూర్వీకుల నుంచి ఆదే స్థలంలో గంగమ్మకు పూజలు చేస్తూ పొంగళ్లు పెట్టుకునే వారమని, ఇప్పుడు ఆ స్థలాన్ని అదే గ్రామానికి చెందిన పార్థసారధి రెడ్డి ఆక్రమించుకుని అక్రమంగా కంచె వేశారని తెలిపారు. ప్రసుత్తం సాంప్రదాయబద్ధంగా నిర్వహించే గంగమ్మ జాతరను జరుపుకోలేక గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. దీనిపై తహశీల్దార్‌కు ఫిర్యాదు చేసిన పట్టించుకోలేదని, కలెక్టర్ జోక్యం చేసుకుని కబ్జాకు గురైన గుడి స్థలాన్ని కాపాడి జాతరకు అనుమతి ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

రోడ్డుపై మండీ షెడ్డు..

అడ్డుకున్న రైతులు

ప్రజాశక్తి- చిత్తూరు డెస్క్: చెట్ల తొలగింపుపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేసిన సంఘటన మండల కేంద్రంలోని వ్యవసాయం మార్కెట్లో సోమవారం చోటు చేసుకున్నది. మామిడి సీజన్ ప్రారంభం కావడంతో బెంగుళూరుకు చెందిన పారిశ్రామికవేత్త వ్యవసాయ మార్కెట్ కమిషనర్ దగ్గర ప్రత్యేకంగా మామిడి మండి కావాలని విన్నవించుకోగా స్పందించిన కమిషనర్ వెంటనే కార్యాలయంకు సమీపంలో ఉన్న స్థలంలో షెడ్డువేసి ఇవ్వాలని ఉద్యోగస్తులకు తెలిపారు. దీంతో మార్కెటింగ్ కమిటీ కార్యదర్శి వెంకటరమణ, సూపర్వైజర్ గంగయ్య, సిబ్బంది ఉన్న పది అడుగులు ఖాళీ జాగాతో పాటు 20 అడుగుల సిసి రోడ్డులోనూ షెడ్డు నిర్మించేందుకు ప్రయత్నిస్తుండగా మామిడి మండి యజమానులు, రైతులు అడ్డుకున్నారు. వాహనాలు వెళ్లే దారిని మండీ కోసం షెడ్లు ఎలా ఏర్పాటు చేస్తారని, ఇది సరైన పద్ధతి కాదని, ఇకనైనా సంబంధిత అధికారులు పరిశీలించి రహదారిలో షెడ్డు నిర్మించడం మానుకోవాలని రైతులు తెలిపారు.

మండీ అనుమతులు రెన్యువల్ చేసుకోండి..

ఏఎంసీ కార్యదర్శి వెంకటరమణ

ప్రజాశక్తి- చిత్తూరు డెస్క్: మండీల అనుమతులను రెన్యువల్ చేసుకోవాలని ఏఎంసి కార్యదర్శి వెంకటరమణ తెలిపారు. సోమవారం ఏఎంసీ కార్యాలయంలో మండి యజమానులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండిల అనుమతుల కోసం రూ.5వేలు, బాడుగలు రూ.10వేలు చెల్లించి రెన్యువల్ చేసుకోవాలన్నారు. 2018లో మండీల అనుమతుల కోసం దరఖాస్తు చేసుకున్నప్పుడు అనుమతుల రుసుమును వసూలు చేశామని, ఆ తరువాత 2024లో వసూళ్లకు మార్కెటింగ్ కమిటీ కమిషనర్ నుండి ఉత్తర్వులు జారీ అయిన తర్వాత చేపడుతున్నామని తెలిపారు. సూపర్వైజర్ గంగయ్య, మండి యజమానులు లోకనాథం నాయుడు, బాబు రెడ్డి, జాఫర్ పాల్గొన్నారు.

గ్రంథాలయాల్లో వేసవి శిక్షణ

ప్రజాశక్తి- కార్వేటినగరం: గ్రంథాలయాల్లో నిర్వహిస్తున్న వేసవి శిక్షణను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని టీకేఎం పేట ఉన్నత పాఠశాల సైన్స్ ఉపాధ్యాయులు మునిరాజ తెలిపారు. సోమవారం గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి శిక్షణా తరగతులకు ముఖ్యఅతిధిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ గ్రంథాలయాలు ఓ విజ్ఞాన భాండాగారాలని, గ్రంథాలయాల్లో అందుబాటులో ఉన్న పురాతన గ్రంథాలు, పోటీ పరీక్షల పుస్తకాలను చదవడం వల్ల పోటీ పరీక్షల్లో అవలీలగా ప్రతిభ సాధించగలరని సూచించారు. గ్రంథాలయాలో ఉన్న సైన్స్ పుస్తకాలను చదవడం వల్ల సైన్సు ప్రయోగాలకు ఎంతో దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి శంకర్ బాబు, విద్యార్థులు,పాల్గొన్నారు.

అరుణాచలేశ్వరుని దర్శించుకున్న మంత్రి

ప్రజాశక్తి- చిత్తూరు డెస్క్: తిరువణ్ణామలై అరుణాచలేశ్వరుని మంత్రి ఆర్కేరోజా సోమవారం దర్శించుకున్నారు. గిరిప్రదక్షిణ చేసిన అనంతరం ఆలయ అధికారులు ఆమెకు స్వాగతం పలికి ఆలయ మర్యాదలు చేసి ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భగవంతుని ఆశీస్సులతో ప్రజలకు మరింత సేవ చేస్తానన్నారు. నాలుగేళ్ళుగా నగరిలో తనపై కోవర్టులు కుట్రలు చేశారని దుష్ప్రచారం చేశారన్నారు. కానీ అభివృద్ధే లక్ష్యంగా తాను పని చేశానని, జనం తనకు అండగా నిలిచారన్నారు. తనకు వెన్నుదన్నుగా నిలిచిన ప్రజల మద్దతుతో మూడవసారి ఎమ్మెల్యేగా గెలిచి 'హ్యాట్రిక్' సాధించడం ఖాయమన్నారు.



విజయోత్సవ ర్యాలీలు వద్దు

పోలింగ్ వృద్ధి 0.14శాతం
తొలుత పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్
గంగజాతరలో 144 సెక్షన్ అమలు
మీడియాతో కలెక్టర్, ఎస్‌పి



జిల్లా కలెక్టర్ ప్రవీణ్ కుమార్, ఎస్పీ హర్షవర్ధన్ రాజు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

తిరుపతి జిల్లా పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలలో సార్వత్రిక ఎన్నికలు 2019 కన్నా 2024లో 78.63 శాతంతో 0.14 వద్ధి సాధించామని జిల్లా కలెక్టర్ ప్రవీణ్ కుమార్ తెలిపారు. సార్వత్రిక ఎన్నికల పోలింగ్ అనంతరం కౌంటింగ్ ప్రక్రియకు సంబంధించి ఏర్పాట్లను జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో మీడియాకు వివరించారు. జిల్లా పరిధిలో ఎక్కడా రీపోలింగ్ జరగకుండా పటిష్ట ఏర్పాట్లు చేశామని, 100 శాతం పోలింగ్ కోసం ప్రణాళికలు చేయడంతో పోలింగ్ వృద్ధిరేటు పెరిగిందన్నారు. తిరుపతి నియోజవర్గానికి సంబంధించి 63.32 శాతం పోలింగ్ జరిగి 2019 ఎన్నికలతో పోల్చితే 2.60 శాతం పోలింగ్ శాతం తగ్గిందన్నారు. ఏఎస్‌డి ఓటరు జాబితా తిరుపతి నియోజకవర్గంలో 54 వేలుగా నిర్ధారించామని, 4 వేల ఓట్లు పోల్ అయ్యాయన్నారు. పోలింగ్ అనంతరం ఎన్నికల పరిశీలకులు, అభ్యర్థులు, వారు ఏజెంట్ల సమక్షంలో శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలోని స్ట్రాంగ్ రూములలో వివిధ బ్లాక్లో ఈవీఎం యంత్రాలను భద్రపరచామన్నారు. ఉపయోగించని ఈవీఎం యంత్రాలను ప్రత్యేక బ్లాక్లో భద్రపరిచామన్నారు. 14 కౌంటింగ్ కేంద్రాలను సిద్ధం చేశామని, మూడంచల భద్రతతో కౌంటింగ్ ప్రక్రియ కొనసాగుతుందన్నారు. కౌంటింగ్ ప్రక్రియ జరిగే క్రమంలో ఎక్కడ గాని జిల్లా పరిధిలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కేంద్ర ఎన్నికల సంఘం సూచనల మేరకు అదనపు బలగాలను వినియోగిస్తున్నామన్నారు. గంగజాతరకు 144 సెక్షన్ అమల్లో ఉందన్నారు.

కౌంటింగ్‌కు శిక్షణ

సార్వత్రిక ఎన్నికలు పోలింగ్ తరువాత చివరి ఘట్టమైన కౌంటింగ్ ఘట్టాన్ని విజయవంతంగా పూర్తి చేయడానికి 350 నుండి 400 మంది కౌంటింగ్ సిబ్బందికి మంగళవారం ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని ఇస్తున్నామన్నారు. తొలుత పోస్టల్ బ్యాలెట్ ద్వారా 24 వేల ఓట్లను లెక్కించనున్నామన్నారు. కౌంటింగ్ అనంతరం ఎటువంటి విజయోత్సవ ర్యాలీలు నిర్వహించరాదని చెప్పారు.

స్ట్రాంగ్ రూమ్ వద్ద భద్రత....

ఈవీఎం మెషిన్లను అత్యంత కట్టుదిట్టమైన భద్రత నడుమ స్ట్రాంగ్ రూములలో ఉంచారు. వీటి పర్యవేక్షణకు సిబ్బందిని ఏర్పాటు చేస్తూనే 90 సీసీ కెమెరాలు స్ట్రాంగ్ రూమ్ లోపల, బయట పనిచేస్తున్నాయన్నారు. ఎటువంటి విద్యుత్తు అసౌకర్యం ఏర్పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకున్నాం. ఈ 90 సీసీ కెమెరాల నిక్షిప్తాలను వీక్షించడానికి కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని కలెక్టర్ ప్రవీణ్ కుమార్ తెలిపారు. కౌంటింగ్ కేంద్రం వద్ద మూడు అంచల భద్రతను ఏర్పాటు చేశామని, రెండంచలలో రాష్ట్ర పోలీసు బలగాలు విధులు నిర్వర్తిస్తారని, మూడించలలో కేంద్ర బలగాలు విధుల్లో ఉంటాయన్నారు. కౌంటింగ్ రోజున ఎన్నికల పరిశీలకుల సమక్షంలో స్ట్రాంగ్ రూములను తెరిచి కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభిస్తామన్నారు. తిరుపతి నియోజకవర్గానికి సంబంధించి అభ్యర్థుల జాబితా 46గా ఉండడం కారణంగా కౌంటింగ్ కేంద్రంలోకి అంతమంది అభ్యర్థులను, వారు ఏజెంట్లను కూర్చోబెట్టడం అసాధ్యమని, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలకు సంబంధించిన అభ్యర్థులను కౌంటింగ్ కేంద్రంలోకి అనుమతిస్తామని, మిగిలిన స్వతంత్ర అభ్యర్థుల కోసం ప్రత్యేక హాలును ఏర్పాటు చేసి కౌంటింగ్ ప్రక్రియను వీక్షించడానికి ఏర్పాటు చేశామన్నారు.

సిట్ ప్రాథమిక విచారణ పూర్తి

ప్రజాశక్తి-తిరుపతి సిటి, రామచంద్రాపురం

ఎన్నికల సందర్భంగా ఈనెల 13న పోలింగ్ రోజు రాత్రి, ఆ మరుసటి రోజు తిరుపతి, చంద్రగిరిలో చోటు చేసుకున్న అల్లర్లు, దాడులపై సిట్ బృందం చేపడుతున్న దర్యాప్తు సోమవారానికి ముగిసింది. సిట్ బృందానికి నేతృత్వం వహిస్తున్న డిఎస్‌పి రవిమనోహర్ ఆచారి ఆదివారం తిరుపతి, చంద్రగిరి మండలాల్లో పర్యటించి, ఘటన జరిగిన ప్రాంతాల్లోని స్థానికులను, ప్రత్యేక్ష సాక్ష్యులను విచారించారు. దాడికి గల కారణాలు, ఎలా జరిగిందనే సమాచారాన్ని సేకరించారు. చంద్రగిరి, ఎస్‌వియు క్యాంపస్ పోలీసు స్టేషన్‌లో మరింత లోతుగా విచారణ చేపట్టారు. దాడికి గురైన చంద్రగిరి టిడిపి అభ్యర్థి పులివర్తి నానిని ఎస్‌వియు క్యాంపస్ పోలీసు స్టేషన్‌కు పిలిపించిన సిట్ బృందం సుమారు రెండు గంటల పాటు విచారించింది. కేసుకు సంబంధించిన విషయాలను సిట్ అధికారులకు నాని క్షుణ్ణంగా వివరించారు. ఘటనకు ముందు, తర్వాత వివరాలను సిట్ అధికారులు నానిని ప్రశ్నించారు. దీనికి సంబంధించిన సిసి టీవి పుటేజ్‌లను, పోటోలను సిట్ అధికారులకు అందజేశారు. దాడికి సంబంధం లేని తిరుమలకు చెందిన ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేశారని, వారిని విడిపించాలని సిట్ అధికారులకు పులివర్తి నాని విజ్ఞప్తి చేశారు.

శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలోని స్ట్రాంగ్ రూమ్ సమీపంలో చోటు చేసుకున్న దాడులు, అల్లర్లకు సంబంధించిన ఇప్పటికే 20 మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సుమారు 70 మందికిపైగా కేసులు నమోదు చేసి, గాలింపు చర్యలు చేపట్టారు. ఈ ఘటనల్లో పాలుపంచుకున్న అధికమంది పరారీలో ఉండడంతో అరెస్టులు మరింత ఆలస్యం అయ్యే అవకాశం ఉంది. తిరుపతి, చంద్రగిరి నియోజకవర్గాల్లో రెండు రోజుల పాటు పర్యటించి పలువురు ప్రత్యక్ష సాక్షులు, బాధితుల వద్ద సేకరించిన సమాచారాన్ని ప్రాథమిక సమాచారం పేరుతో నివేదికను ఎన్నికల కమిషన్‌కు సోమవారం రాత్రిలోపు చేరవేశారు. ఎన్నికల కమిషన్ స్పందన బట్టి తదుపరి పరిణామాలు ఉండనున్నాయి.

న్యాయం జరిగే చోటు చెప్పండి

మీడియాతో తిరుమలవాసుల ఆవేదన

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

చంద్రగిరి టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని హత్యాయత్నం కేసులో తన సోదరుడు అప్పన్నగిరి సుధాకర్ రెడ్డిని అక్రమంగా పోలీసులే ఇరికించి జైలు పాలు చేశారని సుధాకర్ రెడ్డి సోదరి హరిత కన్నీటి పర్యంతమయింది. సోమవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో పులివర్తి నాని హత్యాయత్నం కేసులో ముద్దాయిగా చేర్చబడిన హరికృష్ణ తల్లి భువనేశ్వరితో కలిసి హరిత, సుధాకర్ రెడ్డి భార్య మహేశ్వరి మాట్లాడారు. 14వ తేదీ తిరుపతి శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం వద్ద ఏర్పాటుచేసిన స్ట్రాంగ్ రూములు పరిశీలించడానికి వచ్చిన పులివర్తి నానిపై


కుటుంబీకుల ప్రెస్‌మీట్

కొందరు అల్లరి మూకలు హత్యాయత్నానికి పాల్పడిన సమయంలో సుధాకర్ రెడ్డి తిరుమలలోని బాలాజీ నగర్ లో తన నివాసములో భోజనం చేస్తున్నాడని, హరికష్ణ తమిళనాడులో స్నేహితులతో కలిసి జలపాతం వద్ద గడిపాడని అందుకు సంబంధించిన ఆధారాలను తమ వద్ద ఉన్నాయన్నారు. అయితే పోలీసులు ఏ ఆధారాలతో సుధాకర్ రెడ్డిని, హరికష్ణను అరెస్టు చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. గౌరవంగా ఉన్న తమ కుటుంబాన్ని 24 గంటలలో నిందితులను పట్టుకున్నామన్న గుర్తింపు కోసం పోలీసులు అమాయకులను బలి చేస్తారా అని ప్రశ్నించారు. తమ గోడు వినిపించుకోవడానికి సిట్ అధికారుల వద్దకు పోలీసులు వెళ్ళనీయ లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇక తాము పడుతున్న ఈ బాధకు ఎక్కడికి వెళ్లి చెప్పుకోవాలో అర్థం కావడం లేదని కన్నీళ్లు పెట్టుకున్నారు. నిర్దోషులైన తమ వారిని విడిచి పెట్టాలని వేడుకున్నారు.

కర్నాటక బస్సు బోల్తా..

ప్రజాశక్తి- వెదురుకుప్పం /కార్వేటినగరం:

చిత్తూరు -పుత్తూరు జాతీయ రహదారిపై కుప్పానిగుంట చిన్నకనుమ వద్ద సోమవారం కర్ణాటక బస్సు బోల్తాపడింది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కర్ణాటక రాష్ట్రానికి చెందిన కేఆర్ఎస్ ఆర్టీసీ బస్సు ప్రయాణికులతో బెంగళూరు నుంచి పుత్తూరుకు వెళ్తుండగా పద్మసరస్సు సమీపంలోని కుప్పానిగుంట చిన్నకనుమపై భారీవర్షం రావడంతో ఎదురుగా వస్తున్న ఆటోను తప్పించబోయి అదుపు తప్పి రోడ్డుపక్కకు బోల్తా పడింది. ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో ఉన్న ప్రయాణికులకు ఎటువంటి గాయాలు లేకుండా బయట పడటంతో అక్కడి వారు ఊపిరి పీల్చుకున్నారు. బస్సులో ప్రయాణికులతోపాటు డ్రైవర్ను స్థానికులు సురక్షితంగా బయటకు తీశారు.


కుప్పానిగుంట కనుమపై బోల్తాపడిన బస్సు

పోలీస్ పికెటింగ్ పరిశీలించిన ఎస్సై



ప్రజాశక్తి- సోమల: మండలంలోని మేజర్ పంచాయతీ కేంద్రమైన కందూరు, నగిరి గ్రామంలో పోలీస్ పీకెటింగ్‌ను ఎస్ఐ వెంకట నరసింహులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలు ముగిసిన నేపథ్యంలో ఎలాంటి గొడవలు అల్లర్లు జరగకుండా పోలీస్ పికెట్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అదేవిధంగా గ్రామంలోని గ్రామస్తులతో గ్రామసమస్యలపై మాట్లాడి వారికి పలు సలహాలు సూచనలు అందజేసినట్టు తెలిపారు.

తిరుపతి వెస్ట్ డిఎస్‌పిగా రవిమనోహర్ ఆచారి

ప్రజాశక్తి-తిరుపతి సిటి: తిరుపతి డిఎస్‌పిగా కె.రవిమనోహర ఆచారిని నియమిస్తూ ఎన్నికల కమిషన్ సూచనల మేరకు రాష్ట్ర డిజిపి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. వెస్టు డిఎస్‌పిపై విచారణ చేపట్టేందుకు వచ్చిన విచారణ అధికారిని అదేస్థానంలో పోస్టింగ్ ఇవ్వడం చర్చనీయాంశమైంది. పోలింగ్ రోజు, ఆ మరుసటి రోజు చంద్రగిరి నియోజకవర్గంలోని రామిరెడ్డిపల్లి పంచాయతీ, కూచువారిపల్లిలో, శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయ ప్రాంగణంలో చోటు చేసుకున్న దాడుల పట్ల ఉదాసీనంగా వ్యవహరించారన్న ఆరోపణలతో తిరుపతి ఎస్‌పితో పాటు, వెస్టు డిఎస్‌పి సురేంద్రరెడ్డిని బదిలీ చేసి, శాఖపరమైన విచారణకు ఆదేశించిన విషయం విదితమే. ఆయన స్థానంలో రవిమనోహర్ ఆచారిని నియమించారు. ఏసిబి డిఎస్‌పిగా పని చేస్తున్న ఆయనను తిరుపతి డిఎస్‌పిగా, శ్రీసత్యసాయి జిల్లాలో విఆర్‌లో పని చేస్తున్న ఎం.రామారావును అలిపిరి సిఐగా, అనంతపురం విఆర్‌లో విధులు నిర్వహిస్తున్న ఎ.విశ్వనాథ్ చౌదరిని తిరుపతి స్పెషల్ బ్రాంచ్ (ఎస్‌బి) సిఐగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఒకటి రెండు రోజుల్లో సంబంధిత అధికారులు బాధ్యతలు చేపట్టనున్నట్లు సమాచారం. కాగా తిరుపతి డిఎస్‌పిగా నియమితులైన రవిమనోహర ఆచారి ప్రస్తుతం తిరుపతి, చంద్రగిరి నియోజకవర్గంలో జరిగిన అల్లర్లపై ఏర్పాటైన సిట్ బృందానికి నేతృత్వం వహిస్తుండడం గమనార్హం.



సంక్షిప్త వార్తలు

సీజనల్ వ్యాధుల నియంత్రణపై శిక్షణ

ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి

మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సిబ్బందికి ఆరోగ్యం సీజనల్ వ్యాధుల నియంత్రణ, మాతాశిశు సంరక్షణ గురించి, ఆన్‌లైన్ నమోదు ప్రకియపై ప్రత్యేక శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. వ్యాధుల నియంత్రణకు ప్రజలు తీసుకోవల్సిన జాగ్రత్తలు, పాటించవల్సిన సూచనలు వివరించారు. కార్యక్రమంలో పిహెచ్‌సి వైద్యులు విజయచంద్ర, శాలిని, అనురాధ, హెల్త్ ఎడ్యుకేటర్ సావిత్రి, సూపర్వైజర్లు గోపి, పుష్పలత, సిహెచ్‌ఓలు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

మంగళ సూత్రాలు వితరణ

ప్రజాశక్తి- గంగవరం : మండలంలోని కీళ్లపట్ల పంచాయతీ శ్రీకోనేటి రాయ స్వామి కలణోత్సవం సందర్భంగా అదే గ్రామానికి చెందిన అచ్చన్నగారి వేణుగోపాల్, వెంగళప్ప గారి వేణుగోపాలు కలిసి రెండు లక్షల రూపాయల విలువ చేసే బంగారు మంగళసూత్రాలను వితరణ చేసినట్లు ఆలయ అర్చకులు తెలియజేశారు.

నేడు మండల సమావేశం

ప్రజాశక్తి- చిత్తూరు డెస్క్: నేడు మండల సర్వసభ సమావేశం జరుగునని బంగారుపాళ్యం ఎంపీడీవో శివశంకర్ తెలిపారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి జరిగే మండల సర్వసభ సమావేశంలో గత సమావేశంలో తెలిపిన సమస్యల పరిష్కార నివేదికలతో మండల అధికారులు పాల్గొనాలని తెలిపారు. అలాగే ఎంపీపీ, జడ్పిటిసి, ఎంపిటిసిలు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు ఇతర మండల శాఖాధికారులు తప్పనిసరిగా పాల్గొనాలని కోరారు.

మారెమ్మకు కిరీటం బహూకరణ

ప్రజాశక్తి- పలమనేరు: పలమనేరు పట్టణం రంగాపురానికి చెందిన హరిబాబు రాములమ్మ దంపతుల కుమార్తె బసవేశ్వరిలు సోమవారం మారెమ్మ దేవస్థానంకు ఒక్క కేజీ 50 గ్రాముల వెండితో తయారు చేసిన నాగ జ్వాలా కిరీటంను బహూకరించారు. దీని విలుల లక్ష 50 వేలు ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా గుడి పూజారి బాబు ప్రత్యేక అభిషేకాలు పూజలు నిర్వహించారు.

డాక్టర్ నిర్లక్ష్యంతో శిశువు మృతి

ప్రజాశక్తి - వాకాడు: మండలంలోని నిడుగుర్తి గ్రామ పీహెచ్సి ప్రభుత్వ వైద్యశాలలో పనిచేస్తున్న వైద్య అధికారి రామకష్ణ నిర్లక్ష్యం వల్ల వైద్యం వికటించడంతో ఓ గర్భస్థ శిశువు మృతి చెందింది. ఈ సంఘటన వివాదాస్పదమయ్యింది. కుటుంబీకుల వివరాల మేరకు... వాకాడు మండలం మూల పడవ పంచాయతీ పరిధిలోని నలగామాల గ్రామానికి చెందిన ముంగర చెంచురెడ్డి భార్య వాసంతి గర్భిణీ కావడంతో పురిటి నొప్పులు వస్తున్నాయని భర్తకు తెలపడంతో వెంటనే ఆమెను తీసుకొని నిడుగుర్తి వైద్యశాలకు వచ్చి డాక్టర్ను కలిశారు. డాక్టర్ సలహా మేరకు తాను నార్మల్ డెలివరీ చేసి తల్లి బిడ్డను క్షేమంగా ఇస్తానని వారికి తెలిపారు. తాము ప్రసూతి ఆసుపత్రికి వెళ్తామని చెప్పగా వైద్యాధికారి తాను ఫ్రీ డెలివరీ చేస్తానని చెప్పారని, సోమవారం తెల్లవారుజామున నాలుగు గంటల సమయంలో శిశువు మృతి చెందాడని తల్లిదండ్రులకు తెలిపారు . మతి చెందిన బిడ్డను చూసి తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుఅయ్యారు. తల్లిదండ్రులు వైద్య అధికారి నిర్లక్ష్యంతోనే శిశువును కోల్పోయామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఉన్నతాధికారులు స్పందించి శిశువు మతిపై న్యాయ విచారణ చేపట్టి వైద్య అధికారిపై చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరారు.

విమానం రద్దుతో ప్రయాణికుల నిరసన

ప్రజాశక్తి - రేణిగుంట: తిరుపతి విమానాశ్రయంలో సోమవారం స్టార్ ఎయిర్లైన్స్ విమానం రద్దు కావడంతో మధ్యాహ్నం నుంచే వేచి ఉన్న 32 మంది ప్రయాణికులు విమానాశ్రయం లోపల నిరసన చేపట్టారు. మధ్యాహ్నం 3.10 నిమిషాలకు చేరుకొని రేణిగుంట నుండి 4.20 నిమిషాలకు గుల్బర్గాకు వెళ్ళవలసిన స్టార్ ఎయిర్లైన్స్ విమానం సాంకేతిక లోపం వల్ల రద్దయిందని ఎయిర్లైన్స్ అధికారులు తెలపగా, ముందస్తు సమాచారం ఇవ్వకపోగా ప్రయాణికులకు ఎటువంటి సౌకర్యాలు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు కల్పించలేదని వారు నిరసన చేపట్టారు. ఎయిర్‌లైన్స్ సిబ్బంది నిర్లక్ష్యధోరణిపై మండిపడ్డారు.

తిరువన్నామలైకు ప్రత్యేక బస్సులు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకొని ఈ నెల 22వ తేదీన భక్తుల సౌకర్యార్థం తిరువన్నామలైకు శ్రీకాళహస్తి ఆర్టీసీ డిపో నుండి ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ రాజవర్ధన్ రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ బస్సులు ఆర్టీసీ బస్టాండ్ నుంచి ఉదయం 5.30 గంటలకు, 10.00 గంటలకు, 11.45 గంటలకు ఎక్స్ ప్రెస్ సర్వీసులు బయలు దేరుతాయనీ, భక్తులు వినియోగించుకోవాల్సిందిగా కోరారు. బస్సు చార్జీ రూ.350లుగా నిర్ధారించామనీ, ఓపీఆర్ఎస్లో కూడా రిజర్వేషన్ సౌకర్యం కలదని తెలిపారు. వివరాలకు సెల్: 7382880178, 7382880239, 7382875642 నంబర్లను సంప్రదించాల్సిందిగా కోరారు.

ఘనంగా జూనియర్ ఎన్టీఆర్ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : ప్రముఖ టాలీవుడ్ హీరో జూనియర్ ఎన్టీఆర్ జన్మదిన వేడుకలు పట్టణవ్యాప్తంగా సోమవారం ఘనంగా జరిగాయి. జూనియర్ ఎన్టీఆర్ ఫ్యాన్స్ అసోసియేషన్ పట్టణ అధ్యక్షులు వంకాయల సిద్దులయ్య ఆధ్వర్యంలో శ్రీకాళహస్తి దేవస్థానంలో అర్చనలు, అభిషేకాలు, పూజలు నిర్వహించారు. తదనంతరం సన్నిధి వీధిలోని అంబిలి స్వామి దేవాలయంలో భారీ కేక్ కటింగ్ చేసి అక్కడున్న నిరుపేదలకు అన్నదానం చేశారు. స్వీట్లు కేకులు పంచారు. ఈ సందర్భంగా సిద్దులయ్య మాట్లాడుతూ త్వరలో రిలీజ్ కాబోతున్న జూనియర్ ఎన్టీఆర్ దేవర సినిమా సూపర్ హిట్ కావాలని ఆకాంక్షించారు. కన్నావరం హరిబాబు, చైతన్యరెడ్డి, సుదర్శన్, ముఖేష్ పాల్గొన్నారు.

151 సీట్లు పైనే గెలుస్తాం: రామ్‌కుమార్ రెడ్డి

ప్రజాశక్తి -వాకాడు: ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైసిపి ఈ ఎన్నికల్లో 151 సీట్లు పైనే గెలుస్తుందని తిరుపతి జిల్లా సమన్వ యకర్త,వెంకటగిరి నియోజ క వర్గ వైసిపి అభ్యర్థి నేదరమల్లి రామ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఉదయం నేదురమల్లి నివాసంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రపంచంలోనే భారతదేశం అతి పెద్ద ప్రజాస్వామ్య దేశమని అందులో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఎలక్షన్లు నిర్వహించడం ఎలక్షన్ కమిషన్ గొప్పతనం అని వారికి అభినందనలు తెలిపారు. వారితో పాటు ఓటు హక్కు వినియోగించుకున్న ప్రతి ఓటరుకూ అభినందనలు తెలిపారు. తిరుపతి జిల్లా సమన్వయకర్తగా తాను జిల్లాలోని అన్ని నియోజక వర్గాలతో పోల్చితే వెంకటగిరిలో అత్యధిక మెజార్టీతో గెలవబోతున్నానని, తనతో పాటూ ప్రజలకు ఇచ్చిన అన్ని హామీలు నెరవేర్చిన వైయస్ జగన్‌మోహన్ రెడ్డి 2019 లో 151 సీట్లు గెలుచుకున్నారని ఈసారి 151 కన్నా ఎక్కువ సీట్లు సాధించి జూన్ 9వ తేదీ ప్రమాణ స్వీకారం చేయనున్నారని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ ఛైర్మన్ కోడలు దామోదర్ రెడ్డి, జెడ్పిటిసి రౌతు రామకృష్ణ, మాజీ ఎంపీటీసీ మధుసూదన్ రెడ్డి, ఏనుగు సుధాకర్ నాయుడు, మాజీ జెడ్పిటిసి పి కృష్ణారెడ్డి, వివిఆర్, చిట్టమూరు, వాకాడు నాయకులు పాల్గొన్నారు.

'ఇండియన్ నాలెడ్జ్ సిస్టమ్'తో ఒప్పందం

ప్రజాశక్తి - క్యాంపస్ : భారత ప్రభుత్వ విద్యా మంత్రిత్వ శాఖకు చెందిన భారతీయ జ్ఞానపరంపర విభాగానికి (ఐకెయస్), శ్రీ వేంకటేశ్వర వేద విశ్వవిద్యాలయంతో వైదిక సాహిత్యంలో నిక్షిప్తమైన వైజ్ఞానిక విశేషాలను అందించేందుకు మూడు సంవత్సరాల ప్రతిష్ఠాత్మకమైన ఒప్పందం ఉప కులపతులు రాణీ సదాశివమూర్తి, భారతప్రభుత్వ విద్యా మంత్రిత్వ శాఖకు చెందిన భారతీయ జ్ఞానపరంపర విభాగం జాతీయ సమన్వయ కర్త ప్రొఫెసర్ జి సూర్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో కుదుర్చుకున్నారు. ఈ ఒప్పందంలో ప్రధానంగా ఆవిషయాలపై ఆవగాహన చేసుకున్నారు.ఈ సమావేశంలో రిజిస్ట్రార్ ఆచార్య రాధాగోవింద త్రిపాఠి, డీన్ ఆచార్య గోలి సుబ్రహ్మణ్యా శర్మ, ఆచార్య రాధే శ్యామ్, ఆచార్య యంవియస్ పవన్ కుమార్, ఫైనాన్స్ ఆఫీసర్ అంజిరెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా తారక్ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : తెలుగు సినీ నటుడు గ్లోబల్ స్టార్, యంగ్ టైగర్ నందమూరి జూనియర్ ఎన్టీఆర్ 41వ జన్మదినోత్సవాన్ని పుత్తూరు పట్టణంలో అభిమానుల సమక్షంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ సర్కిల్ వద్ద కేక్ కట్ చేసి పేదలకు పంచి పెట్టారు. అనంతరం రక్తదాన శిబిరం, అన్నదాన కార్యక్రమం, నటవీర పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ అభిమానులు అత్యధిక సంఖ్యలో పాల్గొన్నారు.

గుడి స్థలం ఆక్రమణ

చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు ఫిర్యాదు

ప్రజాశక్తి- తవణంపల్లి: మండలంలోని మడవనిరి గ్రామంలో గంగమ్మ గుడికి కేటాయించిన స్థలాన్ని ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు సోమవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. మడవనిరి దళివాడకు చెందిన నాయకులు మునస్వామి, రాజకుమార్ మాట్లాడుతూ తమ పూర్వీకుల నుంచి ఆదే స్థలంలో గంగమ్మకు పూజలు చేస్తూ పొంగళ్లు పెట్టుకునే వారమని, ఇప్పుడు ఆ స్థలాన్ని అదే గ్రామానికి చెందిన పార్థసారధి రెడ్డి ఆక్రమించుకుని అక్రమంగా కంచె వేశారని తెలిపారు. ప్రసుత్తం సాంప్రదాయబద్ధంగా నిర్వహించే గంగమ్మ జాతరను జరుపుకోలేక గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. దీనిపై తహశీల్దార్‌కు ఫిర్యాదు చేసిన పట్టించుకోలేదని, కలెక్టర్ జోక్యం చేసుకుని కబ్జాకు గురైన గుడి స్థలాన్ని కాపాడి జాతరకు అనుమతి ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణాల్లో వేగం పెంచండి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

స్థానిక ధర్మరాజుల స్వామి ఆలయం వద్ద శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్మితమవుతున్న షాపింగ్ కాంప్లెక్స్ పనుల్లో వేగం పెంచాలని ఆలయ ట్రస్ట్ బోర్డ్ ఛైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణ పనులను పరిశీలించారు. పనుల్లో నాణ్యతకు రాజీపడరాదన్నారు. సుమారు రూ.40 లక్షల వ్యయంతో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణాలకు శ్రీకారం చుట్టామనీ, పనులు పూర్తయితే ఆలయానికి ఆదాయ వనరులు సమకూరుతాయని శ్రీనివాసులు చెప్పారు. నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో దేవస్థానం ఇంజనీరింగ్ శాఖ అధికారులు ఏఈ వేణుగోపాల్, వర్క్ ఇన్స్పెక్టర్ బాలాజీ, కాంట్రాక్టర్ భాస్కర్ ముదిరాజ్ పాల్గొన్నారు.